## అధ్యాయము 2

# దేవుని సాక్ష్యమును ప్రచురము చేయుట

పౌలు కొరింథు సంఘంలోని విభజనలు ఎదుర్కొనుచుండిన తరుణంలో, అందుకుగల మూల కారణాన్ని గుర్తించుటతో అతడు మొదలుపెట్టాడు: కొందరు బోధకులు మరియు వారు బోధించు విధానముల విషయంలో వారికుండిన ఇష్టాయిష్టాల ఆధారంగా పరస్పరం విరుద్ధమైన గుంపులు రూపుదిద్దుకొన్నాయి. అపొస్తలిక సాక్షుల సాక్ష్యము యొక్క విలువను అంచనా వేయడానికి, వీధుల్లో తటస్థపడుచుండిన తత్త్వశాస్త్రవేత్తలకు వర్తింపజేయబడిన ప్రజాదరణ పొందిన ప్రామాణిక ప్రమాణములు ప్రయోగింపబడినవి. ఇది సంఘంలో తలపోటెత్తించిన సమస్యగా పరిణమించింది. జ్ఞానమంటే ఏమిటో లోకమునకు గల గ్రహింపునకును, జ్ఞానము గూర్చి దేవుని దృష్టిలో గల విలువకును మధ్య గల తారతమ్యమును పోల్చుటలో పౌలు తన ధ్యాస అంతటిని నిమగ్నం చేశాడు. సిలువ మీద యేసు మరణం ద్వారా కృపకు గల శక్తిని దేవుడు ప్రత్యక్షపర్చాడు. దేవుని జ్ఞానము, ఆశింపబడినట్టు, లోకంలో తమ అధికారమును మరియు పలుకుబడిని ప్రయోగింపగోరిన వారికి ఎక్కువ ఆకర్షణీయమైనదిగా లేదు.

కొరింథులోని క్రైస్తవులు సువార్త బోధను పాక్షికంగా అంగీకరించారు కాబట్టి వారు విభజనలతో వేధింపబడుచుండిరి. వారిలో శరీర సంబంధులైనవారు దేవుని జ్ఞానము, నీతి, పరిశుద్ధత, మరియు సిలువలో గల విమోచనము అంటే ఏమిటో అర్థం చేసుకొనలేకపోయారు. గనుక లోక రీతియైన జ్ఞానముతో మరులుగొలుపబడుచుండిన వారి కొరకు అపొస్తలుడు తన బోధలకు ఒక విన్నపమును అనుబంధంగా చేర్చాడు. అదేమనగా: “నేను మీ మధ్య క్రీస్తును పోలి నడుచుకొనుచుండిన విధానమును పరీక్షించి తెలుసుకొనండి.” పౌలు వారికి సువార్తను బోధించుట మాత్రమే కాదు, గాని తానొక నిజాయితీపరుడైన వ్యక్తియై యున్నాడని కూడ వారి యెదుట నిరూపించుకొన్నాడు. సిలువ విలువలను ఆలింగనము చేసుకొను విషయంలో అతడు వారికి మాదిరిని చూపించాడు. ఆతని హెచ్చరిక ఒక నిగూఢమైన, అస్పష్టమైన సూత్రంగా నివేదింపబడలేదు; అది వ్యక్తిగత జీవిత విధానమై యుండిందని రుజువుచేయబడింది. ఎలాగైనా సరే వాదోపవాదంలో విజయం సాధించాలనేది కాదు, కాని వారేమై

యుండాలని తాను నిరీక్షిస్తున్నాడో దానిని సహోదరులు అర్థం చేసుకొనగలుగునట్లు వారికి సహాయపడాలనేదే అతని కోరికయై యుండింది. తనను తాను అతడు ఉపదేశించుచుండిన సత్యమునకు సహేతుకమైన మూర్తీకరణముగా వారి యెదుట ప్రదర్శించుకొనుట గూర్చి అపొస్తలుడు సంకోచించలేదు. పాఠకులు తన జీవితమును పరీక్షించవచ్చునని అతడు వారిని ఆహ్వానించాడు.

## పౌలు సందేశం సమర్థింపబడుట (2:1-5)

**[1]సహోదరులారా, నేను మీ యొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతోగాని జ్ఞానాతిశయముతోగాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చినవాడను కాను. [2]నేను, యేసు క్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య ఎరుగకుందునని నిశ్చయించుకొంటిని. [3]మరియు బలహీనతతోను భయముతోను ఎంతో వణకుతోను మీ యొద్ద ఉంటిని. [4-5]మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని.**

**వచనము 1.** పౌలు కొరింథు సంఘమును సందర్శించి ఇప్పటికి షుమారు మూడు సంవత్సరములు గతించిపోయాయి. ఈనాటి మిషనరీలు సాక్షమిచ్చుచున్నట్టుగా, ఒక క్రొత్త సంఘములో సిద్ధాంతపరంగాను ప్రవర్తనపరంగాను సుస్థిరతను నిర్వహించుకొనుట తరుచుగా కష్టమవుతుంది. తన రోజుల్లో ఈ పరిస్థితి భిన్నంగా ఉన్నట్టు పౌలు కనుగొనలేదు. అతడు కొరింథులో లేనప్పుడు, అన్యమతస్థుల ఆరాధనా విధానములు తాను కొరింథులో బోధించిన విషయాలను ఆక్రమించాయి. సందేశము మరియు సందేశకుడు తన పాఠకుల మనస్సుల్లో గట్టిగా అల్లుకొనిపోయి యున్నాయని అపొస్తలుడు అర్థంచేసుకొన్నాడు. కాబట్టి, అతడు దృష్టినంతటిని దేవుని దృష్టికి “వెఱ్ఱితనముగా నున్న” దానికిని, లోకము దృష్టికి “జ్ఞానమై” యున్న దానికిని మధ్య గల తారతమ్యము మీది నుండి (1:21-25) తన వ్యక్తిగత జీవితము మరియు తొల్దలుత అతడు కొరింథులోని క్రైస్తవులకు బోధించిన ఉపదేశాల వైపునకు మళ్లించాడు.

అతని బోధలు కపట ప్రవర్తనను ప్రదర్శించలేదు. ఇది సత్యమని కొరింథీ క్రైస్తవులు తామే సాక్ష్యమిచ్చారు. కుతర్కవాదులు సంతవీధుల్లో ప్రయోగించు పద్ధతులకు అతడు ఉపక్రమింపలేదు. అతని ఉపదేశ విధానంలోగాని, ఉపదేశంలోగాని తెలివితేటలతో కూడిన వాక్చాతుర్యము దర్శనమీయలేదు. గనుక అలంకారములతో కూడిన నివేదికలచేత ఉల్లాసపరచబడవలెనని లేదా మర్మముల చేత దిగ్భ్రాంతి కలిగించబడవలెనని వెదకుచుండినవారు యింకెక్కడికైనా వెళ్లవచ్చు. అతడు ముక్కుసూటియైన చాటింపుతో ముక్కుసూటియైన మూర్తీకరణముగా వచ్చాడు.

పౌలు యొక్క సమగ్రమైన ఆలోచన స్పష్టంగా ఉన్నది, కాని గుణదోషవివేచకమైన

విశదీకరణమునకు సంబంధించిన రెండు విషయాల గూర్చిన స్పష్టత అతని తర్కములో నున్న స్వల్పమైన తేడాలను వివరించ డానికి సహాయ కరంగా ఉంటుంది. మొదటిది, **చాతుర్యముతో** (καθ' ὑπεροχὴν, *kath' huperochēn*) అని అనువదింపబడిన పదములు **వాక్కును** (λόγου, *logou*) మాత్రమే సవరించవచ్చు లేదా, అవి "వాక్కును" మరియు **జ్ఞానమును** (σοφίας, *sophias*) కూడ సవరిస్తున్నాయని అర్థం చేసుకొనబడవచ్చు. "వాక్చాతుర్యముతో" అనే పదజాలము సవరిస్తున్న విషయము తాత్కాలిక ఆసక్తిని మించినదై యున్నది. "వాక్కు" మరియు జ్ఞానము ఒకదానితో మరొకటి అన్యోన్య సంబంధంగలవై యున్నవి, కాని ఈ పదములు సమాచార స్రవంతిలోని వెవ్వేరైన కోణాలను నొక్కివక్కా ణిస్తున్నాయి. "వాక్కు" ఒకరు తెలియజెప్పే విషయాన్ని లేదా అట్టి విషయం తెలియజెప్పబడుతున్న విధానాన్ని సూచిస్తుండగా, "జ్ఞానము" దాని స్వభావమునుబట్టియే విషయమును గూర్చినదై యున్నది. పౌలు కొరింథు సంఘానికి చాతుర్యముగల తత్త్వవేత్తల వలె విశేషంగా అలంకృతము చేయబడిన, ప్రస్తుతాంశమునకు ఉపయుక్తముగా మార్చుకొనబడిన మాటలతో రాలేదు; అనగా, అతడు వారి వివరణ విధానమును అనుకరించలేదు. అందువలన, "చాతుర్యమును" "వాక్కుతో" మాత్రమే ముడిపెట్టడం ఉత్తమము. తాను జ్ఞానముతో, కనీసం గ్రీకు ప్రపంచం ఈ పదము యొక్క అర్థమును అర్థంచేసుకొనుచుండిన జ్ఞానముతో రాలేదని కూడ అపొస్తలుడు ధ్రువీకరించాడు. ఎన్ఐవి అనువాదం "చాతుర్యమును" "వాక్కు"తోను, "జ్ఞానము"తోను ముడిపెట్టు చున్నది: "నేను వాగ్ధాటితో లేదా అతీతమైన జ్ఞానముతో రాలేదు." ఏదేమైనప్పటికిని, ఈ సందర్భంలో, ఎన్ఏఎస్బిలో మంచి అనువాదమున్నది: "నేను వాక్కునకు లేదా జ్ఞానమునకు సంబంధించిన చాతుర్యముతో రాలేదు."

గుణదోషవివేచకమైన విశదీకరణమునకు సంబంధించిన రెండవ ప్రశ్న మూల గ్రంథ పాఠభేదమునకు సంబంధించినదై యున్నది. కొన్ని ఆదిమ, అత్యంత ప్రాముఖ్యత ఇయ్యబడిన చేతిరాత ప్రతులలో "దేవుని మర్మము" (μυστήριον τοῦ θεοῦ, *mustērion tou Theou*) అను మాటలు 2:1 ముగింపులో ఉన్నవి. ఇంకా అనేక చేతిరాత ప్రతులలో **దేవుని సాక్ష్యము** (μαρτύριον τοῦ θεοῦ, *marturion tou Theou*) అని వ్రాయబడి యున్నది. ఎన్ఆర్ఎస్వి, "మర్మము" అని అనువదించుచున్నది, కాని అత్యధిక అనువాదములలో "సాక్ష్యము" అని వ్రాయబడి యున్నది. ప్రస్తుత సందర్భంలో (1:6లో "సాక్ష్యము"; 2:7లో "మర్మము") ఈ రెండు పదములు కలవు. అయితే, ఏది ఏదో గుర్తుపట్టడం కొంచెం కష్టం. 2:1లో పౌలు చెప్పుతున్న విషయం అతడు కొరింథీయులకు క్రీస్తును ప్రచురము చేయుచున్న వ్యక్తిగత విధానమునకు సంబంధించినదై యున్నది. "సాక్ష్యము" అని చదువడము మంచి అనువాదము ఎందుకనగా అది అపొస్తలుడు చేసిన పనిని తగిన విధంగా సూచిస్తున్నది.

**వచనము 2.** పౌలు ఉపదేశించినదంతా అతని సందేశంలోని ప్రధాన సత్యముతో పొంతనగలదై ఆ సత్యములో నుండియే బయలువెడలు చుండినది: **యేసు క్రీస్తును, సిలువవేయబడిన యేసు క్రీస్తునే.** లోక రీత్యా జ్ఞానులైనవారు తిరస్కరింపదగిన దానిగా పరిగణిస్తారని అతడెరిగిన సందేశమునకే హత్తుకొని యుండుటకు అతడు బుద్ధి

పూర్వకంగా ఎన్నుకొన్నాడు. అతనిని వెంబడించు వ్యక్తిగత అనుచరులను అనేకులను సంపాదించుకొవలెననేది లేదా తన వ్యక్తిగత పరువును పెంపొందించుకొనవలెననేది అతని ఆశయం కాదు. కొరింథు పట్టణము గుండా వెళ్లిన సంచాలక ఉపదేశకుల స్వప్రయోజనార్థమైన కుయుక్తులను అనుకూలించుకొనుట వలన అతని అనుచరుల సంఖ్య పెరిగిపోయేదే, కాని సువార్త విషయంలో రాజీపడుటకు అతడు తృణీకరించాడు. దేవుడు తనకు బయలుపరచిన ప్రత్యక్షత ద్వారంగా మాత్రమే మాటలాడవలెనని ఎన్నుకొన్నాడు. పౌలు సువార్త ప్రకటించవలెనని, పేరు ప్రఖ్యాతులు గాని సరికదా, ఆర్థిక ఆశయాలు గాని అతనిని బలవంతము చేయలేదు. కొరింథీయులు అతని గూర్చి సాక్ష్యమియ్యవలెనని వారిని ప్రోత్సహించాడు. ప్రకటింపవలెనని క్రీస్తు అతనికి అప్పగించిన సందేశము యొక్క నిజాయితీ విషయంలో, వారు పరిశుద్ధపరచబడునట్లు పరిణమించిన సందేశం గూర్చి రాజీపడటానికి కాని పనంటూ అతడు ఏదియు చేయలేదు.

కొరింథీయులు అతని మాదిరిని అనుసరిస్తూ నడుచుకొనవలెనని ఆశించడం, అపొస్తలుని మాటల్లోని ఉప ప్రధానాంశమై యుండింది. వ్యక్తిగత మహిమ కోసం వారు వెంటబడుచుండిన ఆశయాలను కూడ వారు వదిలిపెట్టాలి. వారు కూడ, అతని వలెనే, సత్యమును గూర్చినది ఇతరమైన ఏ కారణమైనను కాదు గాని అది యథార్థంగా సత్యమై యున్నందునుబట్టి మాత్రమే వారు సత్యమును ప్రకటించుచుండిన నిజాయితీపరులై యుండాలి. క్రీస్తును హత్తుకొనడమనగా, లోకము ఇచ్చు అధికారము మరియు జ్ఞానమునకు సంబంధించిన ఆదర్శములను తృణీకరించడమ వుతుందని వారు నేర్చుకొనవలసి యుండింది. యేసు క్రీస్తు వారి కొరకు సిలువవేయబడినాడంటే, అది వారికే అతిశయకారణమవుతుంది. వారి విషయంలోనైతే, సువార్త విషయమై వారు సిగ్గుపడునట్లు చేయడానికి లోక రీత్యాజ్ఞానులైనవారిని అనుమతించినట్లయితే, వారు దేవుని జ్ఞానమును నిర్లక్ష్యం చేయచడమవుతుంది. సంఘము క్రీస్తు సిలువ చుట్టూర ఐక్యమైనప్పుడు, అల్పమైన అంశాల గూర్చిన బుద్ధిహీనమైన విభజనలు వారిని యిక ఇబ్బంది పెట్టవు.

**వచనము 3.** జ్ఞానము మరియు వెఱ్ఱితనము గూర్చి పౌలు చెప్పినదంతా సంఘములో చోటుచేసుకొనిన విభజలకు ప్రతిస్పందనగా తెలియజెప్పబడింది. అపొస్తలుడు జ్ఞానము విషయంలో అవాస్తవమైన లేక మనోకల్పితమైన సిద్ధాంతాలు ప్రతిపాదించలేదు. ఏ విధంగానైనను సంకోచించకుండానే, వృత్తినిపుణులైన తత్త్వవేత్తలు మరియు అలంకారశాస్త్రజ్ఞుల నుండి కొరింథీయులు ఎదురుచూచుచుండిన మృదువైన కుతర్కమునకు వ్యతిరేకంగా పౌలు తనను తాను పోల్చుకొన్నాడు. వారి వలె గాక, తాను భయపడుచుండెననియు, బలహీనుడై యుండెననియు రుజువుపర్చుటకు ఇష్టపడుచుండెను. పౌలు వారితో కూడ **భయముతోను ఎంతో వణకుతోను** ఉండిన విషయాన్ని కొరింథీయులు జ్ఞాపకం చేసుకొన్నారు. గలతీయలోని క్రైస్తవులకు పౌలు ఇలా వ్రాశాడు, ". . . మొదటిసారి శరీర దౌర్బల్యము కలిగినను నేను సువార్త మీకు ప్రకటించితినని మీరెరుగుదురు; అప్పుడు నా శరీరములో మీకు శోధనగా ఉండిన దానినిబట్టి నన్ను మీరు తృణీకరింపలేదు, నిరాకరింపనైనను లేదు గాని దేవుని

దూతను వలెను, క్రీస్తు యేసును వలెను నన్ను అంగీకరించితిరి" (గలతీ. 4:13, 14). వారికి సువార్తను ఉపదేశించిన యీయన శారీరకంగా గొప్ప వీరుడేమీ కాదు, మధురమైన మాటలు పలికే వక్త కాదు, పేరెన్నికగన్న ఉపాధ్యాయుడేమీ కాదు, సాహసంతో వాణిజ్యం చేపట్టిన వర్తకుడేమీ కాదు. "సువార్త, సొంపుగాను తెలివితేటలతోను బోధింపబడజాలక, బలహీనతలో మాత్రమే బోధింపబడగలదనేది సిలువ యొక్క స్వభావంలో మాత్రమే ఉన్నది."[1]

పౌలు తాను కొరింథీయులకు తెలియజెప్పుచుండిన మాటలను బలపర్చుటకుగాను, తాను మొదటిసారి కొరింథు పట్టణానికి వచ్చినప్పుడు చోటుచేసుకొనిన సంఘటనల గూర్చి (అపొ. 18వ అధ్యాయంలో ఈ సంఘటనలు క్రోడీకరింపబడి యున్నవి) తన పాఠకులకు జ్ఞాపకం చేస్తున్నాడు. అతడు కొరింథు పట్టణానికి, ఏథెన్సులో నిష్ఫలమైన ప్రయాసమై యుండినట్టు అగుపించిన పరిస్థితి నుండి తాజాగా బయలుదేరాడు. తిమోతి మరియు సీల, అచ్చటి సంఘాలను బలపర్చుచు మాసిదోనియలో పరిచర్యచేయుచుండిరి. పౌలు కొరింథు పట్టణానికి ఒక్కడే చేరుకొన్నాడు. అతడు తనతో కూడ జ్ఞానులు మరియు వక్తలు కలిగియుండు యోగ్యత పత్రాలు ఏవియు తీసికొనిరాని అతని గూర్చి వారు సాక్ష్యమిచ్చునట్లు అతడు తొలి దినాల గూర్చి క్రైస్తవులకు జ్ఞాపకం చేశాడు. పౌలుకు సంబంధించినంత వరకు, క్రీస్తునందుండి ఆయనను ప్రచురము చేయుట, లోకము చెప్పుకొనుచుండిన విధంగా పరువును మరియు అధికారమును నిరాకరించుటయై యుండింది.

**వచనములు 4, 5.** అతని **సందేశము** మరియు అతని **ప్రకటనను** గూర్చి కొరింథీయులకు జ్ఞాపకం చేసినప్పుడు, ఈ రెండింటికి మధ్య గల తీవ్రమైన వ్యత్యాసమును వారికి చూపించాలని అపొస్తలుడు ఉద్దేశించాడు. పౌలు, ఇతర ఉపన్యాసకులు మరియు రచయితలవలెనే, తన మాటలను "పదాధిక్యము," అనగా ఉద్ఘాటింపు నిమిత్తమై అతిశబ్ద ప్రయోగమును బుద్ధిపూర్వకంగా ఉపయోగించుట అనే సాహిత్య సంబంధమైన సాధనమును సద్వినియోగము చేసుకొనుట ద్వారా నొక్కివక్కాణించాడు. "సందేశము" మరియు "ప్రకటన" అనే రెండు పదములు కలిపి చదువబడినప్పుడు, పౌలు వారికి తెలియజెప్పాలని ఆశించుచుండిన విషయము యొక్క వ్యక్తీకరణమునకు అవి సంపూర్ణతను సమకూరుస్తాయి. పౌలు ప్రబోధం, **జ్ఞానయుక్తమైన తియ్యని మాటలతో కూడినదది కాదు, సరికదా,** ఆ పట్టణము గుండా పయనిస్తూ, కుతర్కవాదులు మాటలాడుచుండగా వినడానికి కొరింథీయులు అలవాటుపడినట్లు, వాగ్ధాటిగల మాటలతో అతడు తన సందేశమును వినిపించలేదు. దానికి బదులుగా, అతని బోధ **పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనపరచు దృష్టాంతములతో** కూడినదై యుండింది.

నిస్సందేహంగా, పౌలు పరోక్షంగా ప్రస్తావించిన "దృష్టాంతములు" ఆయన చేయుచుండగా తన పాఠకులు చూచిన అద్భుతకార్యములై యుండినవి. అపొ. 18వ అధ్యాయంలో పౌలు చేత కొరింథులో చేయబడిన అద్భుతకార్యముల గూర్చిన వివరములు లేవు, కాని "సూచక క్రియలను అద్భుతములను మహత్కార్యములను చేయుట వలన, అపొస్తలుని యొక్క చిహ్నములు పూర్ణమైన ఓరిమితో మీ మధ్యను

నిజముగా కనుపరచబడెనని" అతడు అటుతరువాత పట్టణంలోని సంఘానికి వ్రాస్తున్నాడు (2 కొరింథీ. 12:12; గలతీ. 3:5 చూడుము). పౌలు కొరింథీయులకు ఉపదేశించుచుండిన సత్యమును అలంకార యుక్తమైన సూత్రములు కాదు కాని, పరిశుద్ధాత్మకు సంబంధించిన సాక్ష్యములు ధ్రువీకరించాయి.

అపొస్తలుడు తాను ప్రకటించిన సందేశముతో తనకు సంబంధం లేదన్నట్టుగా దూరంగా, వేరుగా ఉండుట లేదు. తానే స్వయంగా, అతని గుణము, అతని పరువు, దేవునితో అతనికుండిన సంబంధం, మరియు క్రీస్తునందలి అతని నిరీక్షణ, మున్నగునవన్నీ అతడు కొరింథులో ప్రకటించిన సందేశంలో భాగమై యుండినవి. క్రీస్తు శరీరము యొక్క ఏకత్వము విషయంలో మాత్రమే పౌలు తనను తాను సమర్థించుకొన్నాడు. అతని ఆందోళన అంతా కొరింథు సంఘములో విభజనలుగా పరిణమించిన ముఠా తత్త్వ స్ఫూర్తి గూర్చినదై యుండింది. ఇట్టి విభజనకుగల మూల కారణములను అన్వేషిస్తూ, సిలువ విషయమైన జ్ఞానము మరియు వెర్రితనము గూర్చి తన పాఠకులు యోచించాలని అతడు వారిని విన్నవించుకొంటున్నాడు. "యుక్తమైన జ్ఞానము" అనే మాటల అర్థమునకు సంబంధించిన సిద్ధాంత పరమైన ఆలోచనల గూర్చి అపొస్తలుడు అవసరమైన అంశాన్ని కొద్దిమాటల్లో తెలియజెప్పాడు. సంఘంలో సమాధానం, దేవుని ప్రజల ఏకత్వము, అతడు తన రచనను చేయునట్లు అతనిని ప్రోత్సహించాయి. యుక్తమైన జ్ఞానము విశ్వాసుల నడుమ నెలకొనియుండు ఐకమత్యము మరియు సుహృద్భావంతో ముడిపడినదై యున్నది.

అపొస్తలుడు తన ఆలోచనలను తన బోధ మరియు మాదిరి నుండి కొరింథీయుల విశ్వాసము వైపు మళ్లించాడు. వారి విశ్వాసము వారి రక్షణ కొరకైన హేతువుగా పరిణమించునట్లు అతడు వారికి ఉపదేశించాడు మరియు అందుకు తగిన విధంగా ప్రవర్తించాడు. **అపొస్తలుని విశ్వాసం మనుష్యుల జ్ఞానమును కాదు, కాని దేవుని శక్తిని ఆధారము చేసుకొనినదై యుండింది, గనుక** కొరింథీయుల విశ్వాసం కూడ మనుష్యుల జ్ఞానమును కాదు కాని దేవుని శక్తిని ఆధారము చేసుకొనినదై యుండింది. పౌలు జ్ఞానమునకు పరిశుద్ధాత్మ మూలాధారమై యుండెను (2:10). గనుక అదే విధంగా కొరింథీయులకు అవసరమై యుండిన జ్ఞానమును పరిశుద్ధాత్మ తన సొంత షరతుల మేరకు అనుగ్రహించును. ఇరువురు కలిసి సిలువ విమోచనములో పాలుపంచుకొందురు. జ్ఞానము అవసరమై యుండిన సందర్భంలో పౌలు మానవ నటనలను నిరాకరిస్తూ, కొరింథీయులు సహితం అలాగే చేయాలని ఆశించాడు. ఇలా చేసినప్పుడు, విభజనలు మరియు పక్షం పట్ల ప్రదర్శింపబడు విశ్వాసపాత్రములు ద్రవించిపోతాయి.

ఈ మధ్య కాలంలో, అపొస్తలుడు తన వ్యక్తిగత భారమును జ్ఞాపకానికి తెచ్చుకొంటున్నాడు. కొరింథులో ఉన్న సంఘం విషయమైతే, సువార్త సత్యము మరియు శక్తి చెప్పుకోదగినంత మేరకు వార్తాహరుని గుణలక్షణముతో ముడిపడి యుండినవి. సువార్తను బోధించుచుండినవాడు, తదానుసారమైన ఆవశ్యకతనుబట్టి, ఎల్లప్పుడు అతడు బోదించుచున్నదాని పట్ల అతడు చూపించు తన సొంత నిబద్ధతనుబట్టి మదింపు చేయబడుతుంటాడు. అంశము ఆధునిక ప్రపంచమైనా లేదా

ప్రాచీన ప్రపంచమైనా, క్రీస్తు సువార్తను ప్రకటించువారిపై బహు భారమైన, అతి విస్త్రపిషమైన బాధ్యత ఉన్నది.

## దేవుని జ్ఞానము - దాచబడిన బయలుపరచబడిన (2:6-13)

జ్ఞానమును గూర్చిన తప్పుడు గ్రహింపు మూలాన కొరింథు సంఘంలో ఆ యా పక్షాలు తలెత్తాయి. చివరకు, జ్ఞానమునకును తనకును ఎటువంటి సంబంధమైనను లేదని పౌలు చెప్పదలచలేదు. "దేవుని జ్ఞానము" (1:21) సువార్తకు అండగా నిలిచినది. "సిలువవేయబడిన క్రీస్తు," "దేవుని జ్ఞానమై" యుండెను (1:23, 24). కొరింథీయులు తమ పాపముల నుండి విమోచింపబడుట "దేవుని జ్ఞానమునకు" సాక్ష్యముగా నిలిచింది (1:30), కాని "ఈ లోకాధికారులు" (2:6) దేవుని జ్ఞానము విషయంలో వెలవెలబోయిన అనుకరణను కల్పించారు. ఇట్టి కపటప్రవర్తనను పౌలు తృణీకరించాడు. అపొస్తలుడు వారి మధ్య "క్రీస్తును, అనగా సిలువవేయబడిన యేసు క్రీస్తును" తప్ప (2:2) యిక దేనినైనను ఎరుగకుండవలెనని తాను కోరుకొనినప్పుడు దేవుని జ్ఞానమును ఎంపికచేసుకొన్నాడు. కొరింథీయుల మధ్య ఐక్యము నెలకొల్పబడాల్సిన ఆవశ్యకత ఉన్నదని మందలించుచుండిన తరుణంలో, అతడు హత్తుకొని, వారు కూడ హత్తుకొనవలెనని ఆశించుచుండిన జ్ఞానము - వారిని ఇబ్బందిపెట్టుచుండిన అల్పమైన విభజనలను ఉక్కిరిబిక్కిరి చేయునంతగా అణచిపేయు జ్ఞానము - గూర్చి మరి ఎక్కువ కచ్చితమైన వివరణను ప్రతిపాదించు నిమిత్తము పౌలు తాత్కాలికంగా ఆగిపోయాడు.

### జ్ఞానమునకు సంబంధించిన తీక్షణమైన తారతమ్యము (2:6-9)

**6పరిపూర్ణులైనవారి మధ్య జ్ఞానమును బోధించుచున్నాము, అది ఈ లోక జ్ఞానము కాదు; నిరర్థకులై పోవుచున్న యీ లోకాధికారుల జ్ఞానమును కాదు గాని, 7దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించు చున్నాము; ఈ జ్ఞానము మరుగై యుండెను, జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు తన మహిమ నిమిత్తము నియమించెను. 8అది లోకాధికారులలో ఎవనికిని తెలియదు, అది వారికి తెలిసియుండిన యెడల మహిమా స్వరూపియగు ప్రభువును సిలువవేయకపోయి యుందురు. 9ఇందును గూర్చి**

**దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు,**
**చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు**

**అని వ్రాయబడి యున్నది.**

**వచనము 6.** జ్ఞానము అనగా ఏమిటో కొరింథీయులు భావించుకొను చుండిన దానికిని, జ్ఞానము అనగా ఏమిటో దేవుడు నిర్వచించిన దానికిని మధ్య గల తారతమ్యమును చూపడానికి అపొస్తలుడు మరొక విషయానికి ఉపక్రమించాడు. పౌలు బోధ **ఈ యుగ సంబంధమైన అధికారులు** గుర్తించిన జ్ఞానము వంటిది కాదు, అది ఉన్నతమైనటువంటి జ్ఞానమై యుండెను. **పరిపూర్ణులైనవారు** సువార్తలో స్వతఃస్సిద్ధమైనదై యుండిన జ్ఞానమును అదివరకే గుర్తించారు. కొరింథీ పాఠకులు

పరిపూర్ణులు కావవలెనని అపొస్తలుడు రచించుచుండెను. వారికుండిన జ్ఞానము మరియు పరిపూర్ణతనుబట్టి వారు తమలో ఉండిన కలహమును విడిచిపెట్టుదురు. కొరింథీ క్రైస్తవులలో ఒకడు, “నేను పౌలువాడను” అనియు, మరొకడు, “నేను అపొల్లోవాడను” అనియు స్వాధికారంతో చెప్పుకొనుచుండి నందువలన, వారి ప్రవర్తన వివేకముగల పెద్దలైనవారి ప్రవర్తన కంటె ఎక్కువగా పసిబిడ్డల వంటి ప్రవర్తనగా పరిణమించింది (3:1).

గనుక పౌలు కొరింథీయుల యెదుట రెండు విధములైన జ్ఞానమును ఉంచాడు. మొదటి జ్ఞానము దేవుని నుండి కలిగినది; రెండవది, ఈ యుగము మరియు “ఈ యుగ సంబంధమైన అధికారుల” చేత హత్తుకొనబడిన జ్ఞానమై యుండింది. పౌలు, “యీ లోకాధికారులు” అని చెప్పుటలో పౌలు భావం ఏమై యుండినదో తెలియక వ్యాఖ్యానకర్తలు దిగ్భ్రాంతి చెందారు. వారు, మానవ కంటికి కనిపించని లోకంలో పనిచేయుచుండిన దయ్యముపట్టిన శక్తులై యుండిరని కొందరు అనుకొంటున్నారు. “దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని” దేవుని చేత సృజింపబడినవని అపొస్తలుడు కొలొస్స. 1:16లో స్వాధికారంతో చెప్పుతున్నాడు. వీటిలో, “సింహాసనములు,” “ప్రభుత్వములు,” “ప్రధానులు,” మరియు “అధికారములు” కలిసియున్నవి (రోమా. 8:38; కొలొస్స. 2:15 చూడుము). కొరింథులో విభజనలు ఏర్పడుటకు తోడ్పడిన “జ్ఞానము,” “ఈ యుగ సంబంధమైన దేవత” (2 కొరింథీ. 4:4) చేత ప్రేరేపింపబడిందని పౌలు కొరింథీయులకు తెలియజెప్పుచుండవచ్చు. ఈ వివరముతో వచ్చిన సమస్య ఏమంటే, దీని కొరకు ఈ సందర్భానికే బత్తిగా వింతైనదైయున్న ఒక అంశమును పరిచయము చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. “ఈ యుగ సంబంధమైన అధికారులు” మరొక పర్యాయం 8వ వచనంలో ప్రభువును సిలువవేసినవారుగా పేర్కొనబడ్డారు. పౌలు దేవుని జ్ఞానమును “ప్రభుత్వ అధికారుల యొక్క, ఈ యుగ సంబంధమైన అధికారుల యొక్క గుడ్డిదై మరియు క్షంతవ్యముకాని అజ్ఞానముతో” పోల్చుచుండెనని Richard E. Oster, Jr., శ్రద్ధతో గమనించినప్పుడు అతడు సరైన విషయాన్నే గమనించాడు.[2]

పౌలు తాను రచించిన ఇతర పత్రికలన్నిటిలో వలెనే, ఇప్పుడు కూడ తన ఆశను వ్యక్తం చేస్తున్నాడు. అంతము వచ్చుచున్నది. ప్రభువు తిరిగి వచ్చును. “ఈ యుగ సంబంధమైన అధికారులు” ప్రస్తుతం తమ అధికారాన్ని చెలాయిస్తున్నారు, కాని అది **నిరర్థకమై పోవుచున్నది.** ప్రస్తుత యుగము, దాని అధికారము మరియు అధికారులతోసహా, ప్రభువు తిరిగి వచ్చినప్పుడు గతించిపోవునని పౌలు తన పాఠకులకు తెలియజెప్పలేదు. ఇది నిజమే అయియుండవచ్చు, కాని పౌలు సత్వరమైన ఏదో ఒక విషయం గూర్చి కొరింథీయులకు హామీ ఇవ్వాలని ఆశించాడు. ప్రభువు త్వరలోనే తిరిగి రావచ్చు, లేదా ఆయన రాకడ ఆలస్యం కావచ్చు; అయితే అది ఏదైనా, ఈ రెండు సందర్భాలలో కూడ ఈ యుగము “గతించిపోతుంది.” ఇట్టి ప్రక్రియ ఇదివరకే పౌలు దినములలో ప్రారంభమయ్యింది. అంతము యింకా రాలేదు, కాని లోకాధికారుల ఓటమికి సంబంధించిన క్షణిక దృష్టి చూచుటకు కన్నులుండినవారికి స్పష్టమయ్యింది. “చూడండి, మీ చుట్టూర చూడండి, ఈ యుగము అదివరకే అంతమవడానికి వచ్చిందనే”

విషయాన్ని జ్ఞానులు చూస్తారని పౌలు విన్నవించుకొంటున్నాడు. "గతించిపోవును" అని చెప్పడానికి యోహాను వేరొక గ్రీకు పదమును ప్రయోగించాడు, కాని అతని ఆలోచన ఇదేవిధమైనదై యుండింది. "చీకటి గతించుచున్నది, సత్యమైన వెలుగు ఇప్పుడు ప్రకాశించుచున్నది" అని యోహాను చెప్పుతున్నాడు (1 యోహాను 2:8). ఆ తరువాత, "లోకము గతించిపోవుచున్నది" అని చెప్పుతున్నాడు (1 యోహాను 2:17).

**వచనము 7.** పౌలు ప్రకటించిన జ్ఞానము అతడు స్వయంగా కల్పించుకొన్న ఏదో ఒక రహస్యం కాదు. విశేషంగా, దేవుడతనికి ఇదివరకు **మరుగై యుండిన** ఒక **మర్మము** బయలుపర్చాడు. సిలువ వలన దిగ్భ్రాంతి కలిగించుచుండిన పరిస్థితి చక్కబడింది. సార్వజనీన దేవుడైనవాడు సకల జనుల నిమిత్తము యేసు క్రీస్తు ద్వారా ప్రవేశించడానికి ఒక ద్వారమును తెరిచాడనేది ఆ "మర్మమై" యున్నది (1:30). దేవుడు వారిని ఏర్పరచుకొని, వారిని ఐగుప్తు దేశంలో నుండి వెలుపలికి నడిపించిన ప్రజల సహితం అపార్థం చేసుకొన్నారు. సిలువను గూర్చిన మర్మము, లేదా మరుగై యుండిన **జ్ఞానము**, గతంలో గుర్తింపబడకుండా ఉండిపోయింది; కాని ఇప్పుడు, సువార్త ప్రకటింపబడుట వలన, అది లోకానికి బహిరంగంగా పరిచయమయ్యింది. సంబంధిత భావం రోమా. 16:25-27లో స్పష్టమై యున్నది: ". . . అనాది నుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము . . ." పౌలు ఈ మర్మమును గూర్చిన భావమును ఇతర చోట్ల కూడ పేర్కొన్నాడు. మెస్సీయ యూదులకు మాత్రమే విమోచకుడు కాదు; దేవుని రాజ్యములో అన్యజనులు సహితం తోటి వారసులై యుండిరనేది క్రీస్తు ద్వారా పౌలుకు కలిగిన ప్రత్యక్షతయై యుండింది (ఎఫెసీ. 3:4-6).

అపొస్తలుడు ఆనాటి గ్రీకు భాష ప్రచలితమై యుండిన ప్రపంచంలో ప్రత్యేక ప్రాధాన్యత గలదైయుండిన పదము, "మర్మము" (*mustērion*) అనే మాటను ఎన్నుకొనినప్పుడు, అతడు జాగరూకతతో కూడిన ఎంపిక చేసుకొన్నాడు. కొందరు దేవుళ్లు మరియు దేవతలకు సంబంధించిన విమతస్థులు చేర్చుకొనబడుచుండిన సందర్భంలో వారి కొరకు మతాచార కార్యములు రహస్యంగా నిర్వహింబడుట గ్రీకు మతస్థుల ప్రాచీన లక్షణమై యుండింది. ఇట్టి ప్రవేశ ఆచారములను గ్రీకులు, "మర్మములు" అని పిలిచారు. ద్రాక్షారసమునకు సంబంధించిన దేవత Dionysus వలెనే, ధాన్యమునకు సంబంధించిన దేవతయైన దేమేత్రి ఆరాధింపబడుట, దానితో సంబంధంగల మర్మముల విషయంలో సుప్రసిద్ధి గాంచినదై యుండెను. ప్రాచ్య దేశాల నుండి వ్యాపించుచుండిన ఇతర మర్మములు, ఉదా|| ఆసియా మైనరులో నుండి Cybeleకు హాజరైనవారు, ఐగుప్తు నుండి Isis హాజరైనవారు, గ్రీకు భాష ప్రబలియుండిన ప్రదేశాల్లోనికి ప్రవేశించుచుండిరి.

క్రీస్తును గూర్చిన సందేశం లోకంలో అకస్మాత్తుగా వ్యాపించినది కాదని ప్రకటించడానికి పౌలు తగు జాగ్రత్త వహించాడు. శ్రమలననుభవించిన క్రీస్తు ద్వారా అన్యజనులను మరియు యూదులను కూడ రక్షించాలనే దేవుని రూపకల్పన కాల వ్యవధుల లోనికి విస్తరించి యుండింది. క్రీస్తు శ్రమపడవలసి యున్నదనేది దేవునికి తరువాత వచ్చిన ఆలోచన కాదు (లూకా 24:26; అపొ. 17:3 చూడుము). యేసు చేపట్టనైయుండిన పని గూర్చి దేవుడు ధర్మశాస్త్రములోను ప్రవక్తలలోను మాటలాడాడు (లూకా 24:44). ఇట్టి అవగాహన చొప్పున, దేవుని ప్రణాళిక దేవుని చేత **ముందుగా**

**సంకల్పింపబడింది.** బైబిలులోని "ముందుగా సంకల్పింప బడినది" అనే మాటలు, మానవాళి విమోచనగా పరిణమించిన దేవుని అనుగ్రహముతోకూడిన సంఘటనలకు దేవుడు తన మార్గదర్శకమును సమకూర్చుటను సూచిస్తున్నాయి. మానవులు వారి తొలి శ్వాస తీయకమునుపే దేవుడు కొందరిని రక్షించాలని, కొందరిని దండించాలని ముందుగా నిర్ధారించలేదు. రక్షింపబడగోరువారు మొదట సువార్త వినవలెను. ఆ తరువాత, వారు నిర్ణయించుకొనవలెనని సువార్త వినినవారికి పిలుపు ఇవ్వబడింది (రోమా. 10:14). క్రీస్తుకు పూర్వం షుమారు రెండు వందల సంవత్సరముల క్రితం జీవించిన జ్ఞానియైన ఒక యూదుడు ఇలా యుక్తంగా పలికాడు:

> దేవుడు, ఆదియందు, మానవు నిస్ృజించినప్పుడు,
> వాడు తన సొంత ఎంపికలకు లోనగునట్లు చేశాడు.
> నీవు ఆజ్ఞలను పాటించగలవని ఎంపికచేసుకొన్నట్లయితే;
> అది ఆయన చిత్తమును నెరవేర్చు రాచభక్తి అవుతుంది.
> నీ యెదుట నిప్పు మరియు నీళ్లు ఉంచబడి యున్నవి;
> నీవు దేనిని ఎంపికచేసుకొంటావో, దాని కోసం నీ చెయ్యి చాపు.
> మానవుని యెదుట జీవము మరియు మరణము ఉంచబడి యున్నవి,
> వాడు ఎంపిక చేసుకొనునదే వానికియ్యబడును.[3]

**వచనము 8.** పౌలు సిలువను గూర్చి చేయుచుండిన బోధలతో కూడ కలిసియుండిన జ్ఞానము, ఆతని సమకాలీనులు మరియు వీధుల్లో తర్కించుచుండిన తత్త్వవేత్తల చేత ప్రతిపాదింపబడుచుండిన జ్ఞానమునకు భిన్నమైన శ్రేణికి చెందినదై యుండింది. సంతవీధుల్లోని సంచాలక ఉపన్యాసకులు, ప్రజల చేత ద్వేషింపబడినవారు కొందరైతే, ప్రశంసింపబడినవారు మరికొందరు, **ఈ యుగసంబంధమైన అధికారులతో** కూడ చెయ్యికలిపి, **మహిమాస్వరూపియగు ప్రభువును సిలువ వేసినప్పుడు** దేవుని జ్ఞానము గూర్చిన వారి అజ్ఞానమును ప్రదర్శించారు. కొరింథీ క్రైస్తవులు, సిలువ ధ్వజము క్రింద, సమైక్యతతో సంఘటితమై యుండవలసి యుండింది. పౌలు యొక్క పాఠకులపై వారికి ఎంతో అధికారముండినప్పటికిని, ఈ లోకంలోని గొప్పవారు దేవుని జ్ఞానమును తెలుసుకొనలేదు. దేవుని గూర్చిన వారి అజ్ఞానము నిందాస్తుతిగా పరిణమించింది: యేసును ద్వేషిస్తూ భయపడినవారు ఆయనను సిలువవేయుట ద్వారా దేవుని చిత్తమును నెరవేర్చారు. అది "మన మహిమ నిమిత్తమై" చోటుచేసుకొన్నది (2:7), అప్పుడు "మహిమాస్వరూపియగు ప్రభువు" పైనుండి కలుగు **జ్ఞానము** ద్వారా సిలువ మర్మమును బయలుపర్చాడు.

ప్రత్యేకించి యేసును సూచించడానికి, "మహిమాస్వరూపియగు ప్రభువు" అనే పదజాలమును పౌలు ప్రయోగించిన సందర్భం ఇదొక్కటే. పౌలు (τῆς δόξης, *tēs doxēs*) భావం మరి ఎక్కువ స్పష్టంగా లేదు. వ్యాకరణ సంబంధమైన షష్ఠీ విభక్తి ప్రత్యయము విశేషణ సంబంధమైనదై యుండవచ్చు, అనగా "మహిమ గల ప్రభువు." ఇదే విధమైన పదజాలమును యాకోబు 2:1లో ఎన్ఏఎస్బి, "మహిమగల మన ప్రభువైన యేసు క్రీస్తు" అని అనువదిస్తున్నది. ప్రత్యామ్నాయంగా, దేవుని ఉన్నతమైన

మరియు పరిశుద్ధమైన విధానములను పౌలు "మహిమ" అనే మాటతో బహుశా క్రోడీకరించుచుండవచ్చు. యేసు వీటన్నిటి యొక్క సర్వోచ్ఛమైన సాక్షాత్కారమై యున్నాడు. పౌలు మనస్సులో, దేవుడు పరలోకమండలములలో యేసును తన కుడి చేతి వైపున కూర్చుండబెట్టుకొన్నప్పుడు ఇచ్చిన మహిమ ఉండియుండవచ్చుననేది మూడవ సాధ్యతయై యున్నది.

**వచనము 9.** అనులేఖనము యొక్క మూలాధారమేమిటో కచ్చితంగా తెలియదు; యెషయా మరియు పౌలు చేత ప్రతిపాదింపబడిన విషయాలు కొంతమట్టుకు భిన్నమైనవై యున్నప్పటికిని, అది యెషయా 64:4 (64:3; LXX), యొక్క స్వేచ్ఛానువాదమై యుండవచ్చు. పౌలు పాత నిబంధనలో నుండి ఏదైన ఒక ఉల్లేఖనమును ఎత్తి చెప్పినప్పుడు, మామూలుగా **అని వ్రాయబడి యున్నది** అని పేర్కొనే విధానాన్ని అనుసరించాడు (ఉదా|| రోమా. 15:3, 9), కాని ఇచ్చట బైబిలునకు వెలుపటి మూలాధారము నుండి తీసుకొనబడిన ప్రకటనకు పోల్చుచుండవచ్చు. అయితే ఇలా చేయడం పౌలు యొక్క సాధారణ అభ్యాసం కాదు, గనుక అలా చేసియుండడు. అతడు సువార్తల కథనములలో గ్రంథస్థం చేయబడని యేసు పలికిన మాటలను ఉల్లేఖించడం మరొక సాధ్యతయై యున్నది. యేసు పలికాడని తెలియని ఇతర పలుకులను పౌలు అపొ. 20:35లో ప్రస్తావించాడు. ఇచ్చట పౌలు వ్రాతమూలకంగా ఉన్న ఒక ప్రకటనను అనులేఖించినందు వలన, అతడు పాత నింధనలోని అభిప్రాయాన్ని భావానువాదం చేయుచున్నాడనుట సంభవమే.

యెషయా ప్రవక్త ఇలా వ్రాస్తున్నాడు, "తన కొరకు కనిపెట్టువాని విషయమై నీవు తప్ప తన కార్యము సఫలముచేయు మరి ఏ దేవునిని ఎవడు నేకాలమున చూచియుండలేదు. అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు వినబడలేదు. అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు" (యెషయా 64:4). పౌలు ప్రస్తావిస్తున్న ఈ వచనములోని సరికాని ఉల్లేఖనము, అతడు ప్రేరేపింపబడిన, సాధికారమైన క్రీస్తు యొక్క అపొస్తలుడై యుండుటవలన ఉత్పాదితమవుతున్నదనేది ఉత్తమమైన వివరణమై యున్నది. ఇలా ఉండుటనుబట్టి, ప్రవక్త తెలియజెప్పుచుండిన దానిలో నుండి ఒక క్రొత్త విషయాన్ని రాబట్టునట్లు యెషయా గ్రంథంలోని ఆ యా వాజ్ఞ్మలములను పౌలు విస్తృతం గావించాడు. దేవుడతనికి పరిశుద్ధాత్మ ద్వారా అనుగ్రహించిన ప్రత్యక్షతపై ఆధారపడుతు (1 కొరింథీ. 2:10), అతడు తన అంశముతో పొంతనగలవై యుండిన కొన్ని మాటలను యెషయా 64:4 మరియు 65:16లో నుండి ఎత్తి వ్రాస్తూ తన అభిప్రాయానికి సముచితమైయున్నవని తాననుకొన్న విధంగా విస్తృతం చేశాడు. యెషయా గ్రంథంలోని సందర్భము కూడ కొరింథులోని తన పాఠకులు అర్థంచేసుకోవాలని తానాశించుచుండిన అదే విషయాన్ని ఉపదేశించుచుండినదని అపొస్తలుడు స్వాధికారంతో కోరలేదు. దానికి బదులుగా, యెషయా గ్రంథంలోని మాటలు, కొరింథు పట్టణం లోని పరిస్థితితో సంబంధం పెట్టుకోడానికి అవి వివరింపనలవికాని దేవుని జ్ఞానము మరియు అధికారమును - **కంటికి కనబడని, చెవికి వినబడని** జ్ఞానము మరియు అధికారమును - గూర్చినవై యుండినవని పౌలు తెలుసుకొన్నాడు.

పౌలు కొరింథీ విశ్వాసులకు రెండు సత్యములను తెలియజెప్పగలుగునట్లు యెషయా గ్రంథంలోని మాటలు సహాయకరంగా ఉండినవి. మొదటిది, క్రీస్తు, అనగా సిలువవేయబడిన క్రీస్తు సందేశంలో ప్రదర్శింపబడిన దేవుని జ్ఞానము, దేవుని ప్రజలకు మానవ ఊహలకు అతీతమైన దీవెనగా అదివరకే ఫలించినదని అతడు ధ్రువీకరించాడు. రెండవది, **దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు సిద్ధపరచిన** మరి ఎక్కువైన దీవెనలు ముందుందు కలుగనై యుండినవి.

ఆ కాలములో జీవించుచుండిన ఇతర ప్రజలవలెనే, అది మానవ హేతువాదములకు కేంద్రమై యున్నదని, పౌలు **హృదయము** గూర్చి రూపకాలంకారములో మాటలాడాడు. భావోద్రేకములకు ప్రేవులు కేంద్రస్థానమై ఉన్నవని, కొన్ని సందర్భాలలో మూత్రపిండములు కేంద్రస్థానమై యున్నవని అతడు మరియు అతని సమకాలీనులు ఆలోచించుచుండిరి. ఉదా|| అతడు ఒనేసీమును ఫిలేమోను నొద్దకు వెనుకకు పంపించుచున్నాడని పౌలు ఫిలేమోనుకు తెలియజెప్పినప్పుడు, "నా ప్రాణమైన అతనిని" అని ఒనేసీమును పిలుచుచున్నాడు (ఫిలే. వ. 12). అక్షరార్థం చొప్పున, బానిసయైన ఒనేసీము అతని "ప్రేవులై" యుండెనని పౌలు చెప్పుచుండెను. "'హృదయము,' ఆలోచనలు మరియు చిత్తవృత్తితోపాటు భావోద్రేకములను కలుపుకొనియున్న ఆంతరంగ జీవితమంతటికి ప్రతినిధిగా నిలిచింది. అయితే కొన్ని పర్యాయాలు అది వీటిలో ఏ ఒక్కదానికో లేదా మరొకదానితో ప్రతినిధియై యుండవచ్చు."[4]

## దేవుని ఆత్మ (2:10-13)

**10మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలుపరచి యున్నాడు; ఆ ఆత్మ అన్నిటిని దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు. 11ఒక మనుష్యుని సంగతులు అతనిలో నున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు. 12దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. 13మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మసంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము.**

**వచనము 10.** క్రైస్తవుల చేత ఆలింగనము చేసుకొనబడియున్న పరిపక్వమైన జ్ఞానము, ఈ యుగ సంబంధమైన అధికారుల చేత ప్రయోగింపబడుతున్న ఏ విధమైన జ్ఞానముతోనైనను పోల్చబడజాల నంతగా అతీతమైనదై యున్నదని తన పాఠకులను ఒప్పించగలుగునట్లు అపొస్తలుడు ఈ పదబంధమును యెషయా గ్రంథంలో నుండి అప్పుతెచ్చుకొన్నాడు. దానికి ఇట్టి లోకాతీతత్వము, **అది ఆత్మ ద్వారా ప్రత్యక్షపరచబడుట** వలన కలుగుతున్నది. తన పాఠకులు పరిశుద్ధాత్మ గూర్చి ఆలోచించవలెనను ఆశతో, అతడు **మనకు** అనే ఉత్తమ పురుష, బహువచన

సర్వనామమును ప్రయోగించాడు. 1 కొరింథీ. 2:12, 13లో, "మనము" లేదా "మనకు" అనే మాటలు అదనంగా ఇంకా నాలుగుసార్లు రచించాడు. ఇలా బహువచనం వ్రాస్తూ పౌలు తనతో కూడ ఎవరిని కలుపుకొంటున్నట్టు? ఈ ప్రశ్నకు సమాధానంగా, తద్వారా పౌలు తన అపొస్తలిక అధికారమును ధ్రువీకరింపగోరుట సాధ్యమే. పౌలు మరియు ఇతర అపొస్తలులు ప్రాపంచిక జ్ఞానమును అధిగమించిన ప్రత్యక్షతలను దేవుని నుండి పొందారు. దీనికి అదనంగా, అపొస్తలిక అధికారము గుర్తింపబడుట సంఘమును ఇబ్బంది పెట్టుచుండిన విభజనలను అంతరింపజేస్తుంది. ఏదేమైనప్పటికిని, తక్షణ సందర్భంలో మాత్రం పౌలు ఇతర అపొస్తలుల గూర్చి ప్రస్తావింపలేదు. "మనము" అనే మాట పౌలు తన పాఠకుల యొక్క గుర్తింపు మరియు వారితో నుండు సామరస్యమైన సత్సంబంధాన్ని సంపాదించుట కొరకు ప్రయోగింపబడిన మర్యాద పూర్వకమైన విధానమని మరి శ్రేష్ఠంగా అర్థం చేసుకొనబడు తున్నది. ప్రత్యక్షతలను పరిశుద్ధాత్మ నుండి నేరుగా పొందినందు వలన, **దేవుని మర్మములతోసహా అన్నిటిని పరిశోధించడానికి** అతడు సామర్థ్యంగల వాడయ్యాడు. కొరింథులోని సహోదరులు పౌలు ప్రత్యక్షతను అతని రచనలు చదువడం ద్వారా పంచుకొన్నారు.

**వచనము 11. మనుష్యాత్మ** అనే మాటను పౌలు రచించినప్పుడు, అతడు మనిషి గూర్చే, ఈ మనిషి యొక్క మనస్సు మరియు వ్యక్తిగతమైన ఆలోచనల గూర్చే భావించుచుండెనని స్పష్టమవుతున్నది. ఒకని ప్రేరేపణలు మరియు కోరికలు అతనికే తెలిసినంత స్పష్టంగా ఇతరులెవరికిని తెలియవు. ఈ వ్యక్తి మరియు అతని ఆత్మ, ఒక్కటే అయియున్నవి.

> పౌలు దృష్టికి, ఒకని దేహము వాని చిత్తవృత్తి, వాని వృత్తి, మరియు వాని స్వయం నుండే వేరుచేయబడజాలదు. దేహము ఒకడు భౌతికంగా అస్తిత్వము కలిగియున్న విషయమై యున్నది; అతడు జీవించుటలో, అతడు మరణించుటలో గల ఉద్దేశాన్ని అది బయలుపర్చుచున్నది. ఇంకా బాగా చెప్పుకొనదలచినట్లయితే, ఎవరి కొరకైతే ఈ వ్యక్తి జీవిస్తున్నాడో మరియు మరణిస్తున్నాడో అతనిని బయలుపరుస్తుంది (రోమా. 14:7-9).[5]

దేవుని ఆత్మ, దేవునిని ఆయన ఉన్నది ఉన్నట్టుగా ప్రత్యక్షపర్చు విధానమును క్రైస్తవుడు అర్థంచేసుకోడానికి, ఒకని దేహమునకును వాని ఆత్మకును మధ్యగల ఏకత్వము సహాయకరంగా ఉంటుంది. త్రిత్వమును గూర్చి వివరణాత్మకమైన సిద్ధాంతమును అభివృద్ధి చేసుకొనకుండానే, దేవుని అస్తిత్వము యొక్క సారభూతములో పరిశుద్ధాత్మ పాలుపంచుకొంటాడని అపొస్తలుడు ధ్వనింపజేశాడు. **దేవుని ఆలోచనలు దేవుని ఆత్మకు మాత్రమే ఎరుక.** ఇంతమాత్రమేగాక, విశ్వాసులు దేవునిని మరియు ఆయన పిలుపునకు లోబడువారికి ఆయన అనుగ్రహించు ఆశీర్వాదాలను క్షుణ్ణంగా ఎరుగునట్లు వారిని సమర్థవంతులనుగావిస్తూ, "దేవుని ఆత్మ" వారిలో పనిచేయుచుండును. *క్రైస్తవుడు పరిశుద్ధాత్మ ద్వారా దేవుని జ్ఞానమును పొందడానికి అందుబాటుగలవాడై యున్నాడు.* ఈ లోక జ్ఞానము "నిరర్థకమైపోవును" (2:6), కాని దేవుని జ్ఞానము "దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు సిద్ధపరచిన

మహిమను" బయలుపర్చును (2:9).

**వచనము 12.** పౌలు కొరింథులోని క్రైస్తవుల కొరకు ప్రతిపాదించుచున్న జ్ఞానము, **దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మలో** వారు పాలుపొందిన దాని ఫలితంగా ప్రాప్తించింది. దేవుని నుండి వచ్చు ప్రత్యక్షత, **లౌకికాత్మ చేత** ప్రేరేపింపబడిన జ్ఞానము కంటె పూర్తిగా భిన్నమైన శ్రేణికి చెందినదై యున్నది. "లౌకికాత్మ" స్వీయ చైతన్యము లేని అస్తిత్వమై యున్నది; స్వయం సమృద్ధి, అధికార ప్రయోగము, మరియు ఇంద్రియ ఇష్టసిద్ధి గూర్చిన మనోగతమునకు అదొక సంగ్రహణమై యున్నది. ఆకాశములనంటుకొను ఎత్తైన గోపురములను నిర్మించుకోవాలనే లక్ష్యములలో నిమగ్నమై (ఆది. 11:4), మానవజాతి తన తెలివితేటలతో పీడింపబడుతున్నది. "మేము జ్ఞానముగలవారమని" తమ్మును గూర్చి తాము చెప్పుకొంటూనే, "లౌకికాత్మ చేత" చెరపట్టబడినవారు, బుద్ధిహీనులై యున్నారని తమ్మును తాము రుజువు చేసుకొనుచున్నారు (రోమా. 1:22).

"లౌకికాత్మ" వలె గాక, "దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మ," నిజమైన దేవునిని బయలుపర్చుటకుగాను మానవ కాలములోనికి ప్రవేశించు స్వయం సంపూర్ణమైన పురుషమూర్తియై యున్నాడు. "దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మ" మానవుల హృదయాల్లో దేవుని ప్రేమను కుమ్మరించి యున్నాడు (రోమా. 5:5). కొరింథులోని విశ్వాసులు **దేవుని వలన దయచేయబడినవాటిని తెలిసికొనుటకై** వంచించునట్టి, విధ్వంసక మైనట్టి, మరులుగొలుపునట్టి స్వరాలను గుర్తించగలుగునట్లు పరిశుద్ధాత్మ వారిని సమర్థవంతులనుగా చేశాడు.

కొరింథు క్రైస్తవులకు అభయమియ్యాలనేది పౌలు ఉద్దేశమై యుండింది. సిలువ సందేశానికి లౌకిక జ్ఞానమునకు సంబంధించిన అలంకారార్థాలేవియు లేవు. కాని, ఈ హేతువునుబట్టి సిలువ సందేశాన్ని కొట్టిపేయనేరము. "దేవుని యొద్ద నుండి వచ్చు ఆత్మ" విధేయతను ప్రదర్శించు విశ్వాసులు దేవుడు తన ప్రజలకు వాగ్దానము చేసిన సమస్త మంచి యీవుల గూర్చి ఎరుగునట్లును, వాటిని పంచుకొనునట్లును వారిని సమర్థవంతులనుగా చేయును. అయితే "లౌకికాత్మ" ఏమియు అనుగ్రహించదు.

**వచనము 13.** "పరిశుద్ధాత్మ ద్వారా దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని" గూర్చి అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు తెలియజెప్పాడు. **వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము** అని 13వ వచనం చెప్పుతున్నది. దాని గూర్చి పౌలు మాటలాడిన మరియు వ్రాసిన ప్రత్యక్షతను తెలియజెప్పడానికి అతని ద్వారా పరిశుద్ధాత్మ పనిచేయుచుండెనని పౌలు అర్థం చేసుకొన్నాడు (ఎఫెసీ. 3:3, 4 చూడుము). అతడు రచించిన విషయమును కొరింథు విశ్వాసులు దేవుడు సెలవిచ్చిన ఆజ్ఞగా స్వీకరించాల్సి వుండింది (1 కొరింథీ. 14:37). అతడు కొరింథీయులకిచ్చుచుండిన మందలింపు, **మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ నేర్పు మాటలతో** కూడినదై యుండింది. ఏ యే మాటలకు పరిశుద్ధాత్మ మూలాధారమై యుండెనో, ఆ మాటలు కొరింథు సంఘంలోని చీలికలను బాగుచేయును. ఆ మాటలు సభ్యులు "సంపూర్ణంగా ఏక మనస్సు, ఏక తాత్పర్యముతో సన్నద్ధులై యుండునట్లు" తగిన ఏర్పాటు చేయును (1:10).

**సరిచూచుచు** (συγκρίνω, *sunkrinō*) అని అర్థమిచ్చునట్లు అనువ దింపబడిన క్రియాపదము, క్రొత్త నిబంధనలో, ఇచ్చట 2:13 మరియు 2 కొరింథీ. 10:12లో మరి రెండు పర్యాయాలు మాత్రమే కనబడుతున్నది. ఈ పదానికి మూడు అర్థాలున్నాయి: “కలుపు,” “సరిచూచు,” మరియు “అర్థం చెప్పు.”[6] 2 కొరింథీ. 10:12లోని సందర్భాన్నిబట్టి “సరిచూచు” అనే అనువాదం సరిపోతుంది, కాని 2:13లో దీని అర్థం కొంత మేరకు **ఆధ్యాత్మికమైన** రెండు సందర్భముల యొక్క లింగము (స్త్రవఅసవతీ)పై ఆధారపడి యుంటుంది. ఒక సందర్భంలో, విశేషణము (πνευματικὰ, *pneumatika*) స్పష్టంగా నపుంసక లింగమై యుండి, “ఆత్మ సంబంధమైన విషయాలు” అని అర్థమిస్తున్నది. మరొకటి (πνευματικοῖς, *pneumatikois*) గ్రీకు భాషలో చతుర్థీ విభక్తి ప్రత్యయముతో బహు వచనంలో ఉన్నది. నపుంసక లింగం మరియు పుల్లింగము విషయంలో ఒకే రూపం వాడబడింది. ఇది పుల్లింగము సందర్భం చొప్పున అర్థం చేసుకొనబడినట్లయితే, అది “ఆత్మ సంబంధమైన మనుష్యులను” లేదా “ఆత్మసంబంధమైన మాటలను” సూచింపవచ్చు. నపుంసక లింగము సందర్భం చొప్పున అర్థం చేసుకొనబడినట్లయితే, అది ఆత్మ సంబంధమైన ఆలోచనలను సూచిస్తుంది. ఎన్ఆర్ఎస్వి భాషాంతరీకరణము, *sunkrinō* అనే గ్రీకు పదాన్ని “అర్థం చెప్పు” అనే అర్థంతోను, “ఆత్మ సంబంధమైన” అనే విశేషణం పుల్లింగములో ఉన్నట్టును అంగీకరించుచున్నది. అలాంటప్పుడు, 2:13 యొక్క అనువాదం, “ఆత్మ సంబంధులైనవారికి ఆత్మ సంబంధమైన సంగతుల గూర్చి అర్థం చెప్పుచు . . .” అవుతుంది.[7]

NASB మరియు NIV భాషాంతరీకరణములు NRSV భాషాంతరీ కరణమునకు భిన్నమైన విధానమును అవలంబించుచున్నవి: “. . . ఆత్మ సంబంధమైన ఆలోచనలను ఆత్మ సంబంధమైన మాటలతో కలుపుచు” అని NASBలోను, “. . . ఆత్మ సంబంధమైన వాస్తవములను ఆత్మ నేర్పు మాటలతో వివరించుచు . . .” అని NIVలోను కలదు. “ఆత్మసంబంధమైన” అనే పదమును గూర్చిన ప్రశ్నార్థకమైన సందర్భము పుల్లింగమై యున్నది కాని దానిని “మాటలకు” మాత్రమే వర్తింపజేయాలని అర్థంచేసుకొన్నట్లయితే, ఈ రెండును సంబంధిత ఆలోచనలో ఒకదానితో మరొకటి ఒకే విధంగా అనువదింపబడి యున్నవి. పౌలు బోధకు ఎటువంటి హానినైనను కలుగజయేకుండా ఈ రెండు అనువాదములను సమర్థింపవచ్చు; కాని దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా బయలుపరచబడిన ప్రత్యక్షతలో తన పాఠకులు నమ్మకముంచవలెనని పౌలు ఆందోళన చెందుచుండెను గనుక, వ్యక్తిగతమైన మనుష్యులను సూచిస్తూ, “ఆత్మ సంబంధమైనవారు” అని ఎన్ఆర్ఎస్వి భాషాంతరీకరణములో గల అనువాదము ఎంచుకోదగినదై యున్నది.

## ప్రకృతి సంబంధమైన మరియు ఆత్మ సంబంధమైన మనుష్యుడు (2:14-16)

యేసు పైవస్త్రమును నీ పైన వేసుకొనడమనగా, నీవొక మిషనరీపై యుండుట అని అర్థం. యేసునందు విశ్వాసముంచి, ఆయనను పూర్ణ ఆత్మతోను పూర్ణ మనస్సుతోను ప్రేమించడమనగా, నీవు కనుగొనిన సత్యమేమిటో నీవు ప్రేమించువారికి తెలియజెప్పడమని అర్థం. లోకం అనాసక్తిని, లేదా యింకా ఘోరమైన పరిస్థితిని అనగా శత్రుభావమును ప్రదర్శించినప్పుడు క్రైస్తవులు దిగ్భ్రాంతి చెందుతుంటారు. ప్రతి ఒక్కరు ఎందుకు గమనించలేకపోతున్నారు? ఈ ప్రశ్నను పౌలు 2:14-16లో చర్చించాడు.

**14ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు. అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపడు. 15ఆత్మసంబంధి యైనవాడు అన్నిటిని వివేచించును గాని అతడెవనిచేతనైనను వివేచింప బడడు. 16ప్రభువు మనస్సును ఎరిగి ఆయనకు బోధింపగలవాడెవడు? మనమైతే క్రీస్తు మనస్సు కలిగినవారము.**

**వచనము 14. ప్రకృతి సంబంధియైన మనుష్యుడు** అనే అనువాదం, ఒక భాషలోని నుడికారమును తీసుకొని మరొక భాషలోనికి అన్యపరము చేయుటలో గల కష్టమునకు సాక్ష్యమై యున్నది. "ప్రకృతి సంబంధమైన మనుష్యుడు" అనే పదబంధము కనీసం సరైన పరిధిలోపల ఉన్నప్పటికిని, ψυχικός (*psuchikos*) అనే గ్రీకు పదమునకు సరిసమాన మైన ఆంగ్ల పదము లేదు. పౌలు మనస్సులో స్వాభావికమైన ఆకాంక్షలు అధీనములో నుండు పైపై స్థాయిలో జీవించు మనుష్యుడుండెను. ప్రకృతి సంబంధమైన మనుష్యుడు, భోజనం చేస్తాడు, నిద్రపోతాడు, ఆహ్లాదానంద మునిచ్చు అనుభూతుల కొరకు వెదకుతుంటాడు, తన ప్రత్యేకార్హతల కొరకు పోట్లాడుతాడు, ప్రేమ, నీతి మరియు అతని ఉనికికి గల హేతువు గూర్చి తనను తాను అంతగా పట్టించుకొనడు. ఈ విశాల విశ్వము యొక్క లేదా మానవాళి యొక్క స్వభావము గూర్చి అతడు ఏ భావనలు కలిగియు న్నప్పటికిని అవి వాని సొంత ఊహాగానాల చేత వానికి పిలుపుని స్తుంటాయి. ఇదే ఊహాగానం ఇంకా కొంచెం అభివృద్ధి చెందిన రూపంలో, "తత్త్వశాస్త్రము" అని పిలువబడుతుంది. ప్రకృతి సంబంధమైన మనుష్యుడు అజ్ఞానముతో జీవించవచ్చు, లేదా వాడొక కుతర్కవాదముతో కూడిన తత్త్వవేత్తయై యుండవచ్చు. ఇటువంటి వారి విషయంలో, దేవుని స్వీయ ప్రత్యక్షత వారి జీవితాలకు పొంతనలేనిదై యుంటుంది. కాబట్టి, దేవుని వాక్యం వెఱ్ఱితనమై యున్నదని దానిని త్రోసిపుచ్చుతారు. దీనికి తారతమ్యంగా, దేవుడు, స్వీయ సుఖాన్ని కోరుచుండు స్వార్థసేవాభి మానమును మరియు స్వార్థపరత్వమును కూడ వెఱ్ఱితనము అని పిలుస్తున్నాడు (3:19).

ప్రకృతి సంబంధమైన మనుష్యుడు మరియు ఆత్మ సంబంధమైన మనుష్యుడు మధ్య వారు పంచుకొను కొన్ని విషయాలున్నాయి. ఈ ఇరువురు వెవ్వేరు మండలములలో కదలాడుతుంటారు. సంపూర్తిగా **సంబంధియైన మనుష్యుడు దేవుని**

**ఆత్మ విషయములను అంగీకరింపడు.** ఇది వీడు సిలువ సందేశం పట్ల ఉదాసీనంగా ఉండుటకు లేదా వాని వైరమును ప్రదర్శించుటకుగల కారణమై యున్నది. **ఆత్మ సంబంధమైన విషయాలు అతనికి వెఱ్ఱితనముగా నున్నవి; గనుక వాటిని అతడు గ్రహింపజాలడు.** ప్రకృతి సంబంధమైన మనుష్యుడు, ఎప్పటి వలెనే, వాని మనుష్య జ్ఞానముపై ఆధారపడును, గనుక దేవుని ప్రత్యక్షత యొక్క విలువను అంచనా కట్టడానికిని, దాని గొప్పతనాన్ని గ్రహించడానికిని బుద్ధిజ్ఞానముల మూలాధారములు లేనివాడై యుంటాడు. "దేవుని ఆత్మ" చేత బయలుపరచబడు విషయాలను **ఆత్మ సంబంధముగానే వివేచింపవలెను.**

వారు ఎప్పుడైతే పరిశుద్ధాత్మ చేత ఉపదేశింపబడుటకు తమ్మును తాము అనుమతిస్తారో అప్పుడు వారు దైవభక్తికి సంబంధించిన జ్ఞానములో పాలుపంపులుగలవారవుతున్నారని పౌలు కొరింథీ విశ్వాసులకు అభయమొసగాడు. ఇటువంటి వివేచన ఆంతర్యములో మాత్రమే అర్థమవుతుంది. సంపూర్ణ మంచితనము, నిరీక్షణ, మరియు క్రీస్తునందుండుట వలన లభించు సహవాసము గూర్చిన సమాచారాన్ని క్రైస్తవుడు ఒక అవిశ్వాసికి అందజేయనేరడు. ఇటువంటి జ్ఞానము ఆయనయందు జీవించుట వలన మాత్రమే అబ్బుతుంది. ఒకడు దేవుని ఆత్మను పొందక మునుపు, వాడు తనను తాను దేవుని యెదుట బాహాటంగా సమర్పించుకొనవలెను.

అవిశ్వాసియైనవాడు బైబిలు సత్యముల వాస్తవముల గూర్చియే స్పష్టమైన అవగాహన కలిగియున్నప్పటికిని, వ్యక్తిగతంగా అన్వయించుకొనబడు సత్యమును అతడు తృణీకరింపవచ్చునని Robert H. Stein సూచించాడు.[8] అవిశ్వాసియైనవాడు బైబిలు బోధను "వెఱ్ఱితనము" అంటూ తృణీకరించినప్పుడు, యేసు యొక్క మూర్తిమంతములో దేవుడు చారిత్రాత్మకంగా క్రియాశీలకమైనవాడై యుండెననే క్రైస్తవ సాక్ష్యమును అతడు నమ్మడం లేదని అతడు ధ్రువీకరిస్తున్నాడని అర్థం. బైబిలు గ్రంథస్థం చేసిన విషయాల చారిత్రాత్మకమైన ఏర్పాటు అతనికి తెలిసియుండవచ్చు గనుక పౌలు ధ్రువీకరిస్తున్న విషయాలకు సంబంధించిన సత్యముల గూర్చి అతడు నిశ్చయమైన అవగాహన కలిగియుండవచ్చు. అతని చెవికి వినబడుతున్న విషయాన్ని అతడు వెఱ్ఱితనముగా పరిగణించినప్పుడు, బుద్ధికుశలత స్థాయిలో అర్థంచేసుకోడానికి అతడు అసమర్థుడనే అంతరార్థమేదియును అందులో లేదు. దానికి బదులుగా, తన వ్యక్తిగత జీవితానికిగల సువార్త ప్రాముఖ్యతను అతడు నిరాకరిస్తున్నాడు.

ఈ వాక్యభాగములో గుర్తింపబడిన మూడు వర్గములకు చెందినవారు గందరగోళం సృష్టిస్తున్నవారి వలె ఉన్నారు. కొందరు వీరిని విలక్షణంగా మూడు తరగతులుగా విభజిస్తారు: (1) "ఆత్మ సంబంధమైనవారు" (πνευματικοί, *pneumatikoi*) - వీరు తిరిగిజన్మించి ఆత్మసంబంధంగా పరిపక్వత చెందినవారై యున్నవారు. గనుక పౌలుకు ఎక్కువ మద్దత్తుదారులై యున్నారు. (2) "శరీర సంబంధమైనవారు" (σαρκικοί, *sarkikoi*) - వీరు తిరిగి జన్మించనివారు (3:3). (3) "ప్రకృతి సంబంధమైనవారు" (ψυχικοί, *psuchikoi*) - వీరు పరిపక్వత చెందనివారై యున్నారు. పౌలు "శరీర సంబంధమైనవారిని" (*sarkikoi*) మరియు "ప్రకృతి సంబంధమైనవారిని" (*psuchikoi*)

ఒకే వర్గముగా సూచించాడని ఒకరు అర్థం చేసుకొన్నప్పుడు పరిభాష భంగమవుతున్నది. 3:3లో పౌలు మాటలాడుచుండిన అంశము విమతస్థుల గూర్చినది కాదు; అది కొరింథులోని క్రైస్తవులను గూర్చినదే. ఉత్తరోత్తర రెండు వర్గములవారిని, రెండు విభిన్న కోణాల్లో దృష్టింపబడు ఒకే వర్గముగా పరిగణించడం ఉత్తమమైన దృక్పథమవుతుంది. ఈ ఇరు వర్గములవారు శరీరాశలను అనుసరిస్తూ, ఉన్నతాశయముగల జీవితం జీవించడానికి వినబడు దేవుని పిలుపు యెడల ఉదాసీనులై యుంటారు.

పౌలు మాటల ప్రకారం, నటనాసహితమైన వైభవము, ఐశ్వర్యము, తత్త్వశాస్త్ర జ్ఞానము, లోకము యొక్క అండదండలు దేవుని చేత పూర్తిగా తృణీకరింపబడినవి గనుక అవి దేవుని ప్రజల చేత కూడ తృణీకరింపబడవలెను. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో దేవుడు బలహీనులైనవారిని ఏర్పరచుకొన్నాడు (1:27).

**వచనము 15.** పౌలు కొందరిని **ఆత్మసంబంధమైనవారనియు**, ఇంకొందరిని "ప్రకృతి సంబంధమైనవారనియు" పిలుస్తూ వారి మధ్య గల తారతమ్యము గూర్చి పౌలు యోచించాడనే విషయం స్పష్టంగా వున్నది (2:14), కాని వారు ఒక వర్గము నుండి మరొక వర్గములోనికి వెళ్లగల విధానమును పౌలు (కనీసం ఈ సందర్భంలోనైనా) వర్ణించలేదు. ఇటువంటి వాక్యభాగం సాధ్యమేనా? ఒక వర్గమునకు గాని లేదా మరొక వర్గమునకు గాని చెందినవారు ఆ వర్గంలో పుట్టినప్పటి నుండి ఉన్నవారని అనదగునా? ఒకడు తన జీవితంలోని ఒక దశలో ప్రకృతి సంబంధమైనవాడుగాను, మరొక దశలో ఆత్మసంబంధమైనవాడుగాను ఉండవచ్చుకదా? మనుష్యులు ఎంపిక చేసుకోడానికి వాస్తవమైన ఎంపికలున్నాయా? వారి నిర్ణయాలకును, వారు ఆత్మసంబంధమైన వారుగానో లేదా ప్రకృతి సంబంధమైనవారుగానో ఉండుటకును ఏదైనా సంబంధం ఉంటుందంటారా? అతడు వ్రాసిన ఈ పత్రిక ప్రకృతిసంబంధమైన వాని మార్గమును ఎంపికచేసుకొనినవారు మారుమనస్సు నొంది ఆత్మసంబంధమైనవారగునట్లు వారిని సవాలు చేస్తుందని పౌలు నిస్సందేహంగా నిరీక్షించాడు. పౌలు కొరింథు పట్టణంలో సువార్త ప్రకటించడం, సమాచారాలు ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకొంటూ పట్టణంలోని సంఘంతోగల సంబంధాన్ని నిర్వహించుకొనడం. వాదోపవాదములు చేస్తూ వారి మందలించుట కొనసాగించడం - ఒకానొక దినాన కొరింథు సంఘంలో మార్పు తప్పక వస్తుందని అపొస్తలుడు నమ్మాడని ఇవన్నీ సాక్షమిస్తున్నాయి. అతడు, అన్నిటికీ అదృష్టమే ప్రధానమనే విధివాదముతో కూడిన దృష్టికోణమును కలిగియుండలేదు. ఏ ఒక్కరైనను తిరిగిపొందబడలేనంతగా ప్రకృతిసంబంధమైనవాడు కాదు, మరియు ఏ ఒక్కరైనను యథాపూర్వస్థితికి తేడానికి వీలులేనంతగా ఆత్మసంబంధమైనవాడు కాదు. సువార్త, వారి నుండి సాధికారంతో కోరుచున్న విషయాలను తన పాఠకులు ఆలకించి, ఎంపికలు చేసుకొని, మారుమనస్సునొంది, వారు ఆత్మసంబంధమైనవారుగా ఎదుగాలని పౌలు ఎదురుచూశాడు.

ఒకడు తన చిత్తవృత్తిని వినియోగించుకొంటూ సువార్తకు లోబడినప్పుడు, దేవుని ఆత్మ వాని అంతరంగంలో నివసిస్తూ వానికి శక్తినొసగడం సంబంధిత ఫలితమవుతుంది. పరిశుద్ధాత్మ అతనితో కూడ భాగస్వామియైనప్పుడు, ఏ విషయం దేవుని

ఘనపర్చుతుంతో, ఏ విషయం పాపభారమును తొలగిస్తుందో, ఏ విషయం దుర్బలులనుగా చేసి నాశనం చేస్తుందో, ఆత్మసంబంధమైనవాడు వివేచింపగలుగును. "ఆత్మసంబంధమైనవాడు" అన్నిటిని వివేచించును. "అన్నిటిని వివేచించిన" మీదట, అతడు మేలును మరియు దైవభక్తిగల మార్గములను ఎంపికచేసుకొంటాడనేది దాని అంతర్భావమై యున్నది. ప్రకృతి సంబంధమైన మనుష్యుడు, తన ఎంపికలు చేసుకొనిన తదనంతరము, విశ్వాసము, సంతోషము, లేదా విశ్వాసికిగల నిరీక్షణ ఏమైయున్నవో అర్థంచేసుకొనలేడు. తత్ఫలితంగా, క్రైస్తవుడు **ఎవని చేతనైనను వివేచింపబడడు.**

**వచనము 16.** పౌలు, ". . . అని వ్రాయబడి యున్నది" అనే పరిచయ పదజాలములను పేర్కొనకుండానే (2:9తో పోల్చి చూడుము), యెషయా 40:13 ఉల్లేఖించాడు. 2:16లోగల ప్రశ్న అలంకార కోణంగలదై యున్నది. **ప్రభువు మనస్సును ఎరిగి ఆయనకు బోధింపగలవాడెవడు?** స్పష్టంగా, "ప్రభువు మనస్సు" ఏ ఒక్కరికైనను ఎరుక కాలేదు. ఇటువంటి ప్రశ్నకియ్యబడు సమాధానం, తరువాతి తర్కమునకు తావియ్యదు. ప్రకృతి సంబంధమైన మనుష్యుడు, వాని ప్రకృతి సంబంధమైన జ్ఞానముతో, ఆత్మసంబంధమైన మనుష్యుని మనస్సును, హృదయాన్ని, మరియు ఆత్మను వెదకి కనుగొనడం ఎంత అసాధ్యమో, ఏ మానవుడైనాగాని దేవుని మనస్సును వెదకి, దానిని కనుగొని, దేవునికి సలహాదారుగా ఉండట కూడ అంతే అసాధ్యమంటూ, అపొస్తలుడు ముందుకు సాగాడు. క్రైస్తవులు "క్రీస్తు మనస్సు"లో పాలిభాగస్థులై యున్నారు ఏలయనగా వారికి తనను తాను ప్రత్యక్షపరచుకొనడానికి ప్రభువు ఎంపిక చేసుకొన్నాడు. ప్రకృతి సంబంధమైన మనుష్యుడు, దేవుని మనస్సును ఎరుగుటకు ఆయనను ఏ మేరకు సన్నిహితంగా సమీపించునో, ఆత్మసంబంధంగా వివేచించువాని మనస్సును తెలుసుకొనుటకు అంత దగ్గరగా మాత్రమే రాగలడు.

యెషయా గ్రంథంలో నుండి ఉల్లేఖించిన మీదట, **మనమైతే క్రీస్తు మనస్సు కలిగినవారము** అని పౌలు ధ్రువీకరిస్తున్నాడు. ఇది ధైర్యంతో కూడిన పలుకే. "మనము" అనే ఉత్తమ పురుష బహువచనమును ప్రయోగించడం ద్వారా, అతడు కొరింథీయులతో కూడ ఆత్మసంబంధమైన సమష్టి వాస్తవికతలో తానే పాల్గంటున్న విషయం అతడు అర్థం చేసుకొన్నాడని అపొస్తలుడు ప్రదర్శిస్తున్నాడు. "క్రీస్తు యేసు" మనస్సును కలిగియుండుట అనగా, పాపము గూర్చి పశ్చాత్తాపముతో మారుమనస్సు నొందుట, సిలువ క్రింద గల తన స్థానమును ఆక్రమించుకొనుట, నటనలను మరియు స్వయం సమృద్ధిని త్యజించుట అని అర్థం. విభిన్నాభిప్రాయాల విషయంలో తలెత్తు కీచులాటలు, ఉపదేశకుల గూర్చిన ఇష్టాయిష్టాల ఆధారంగా విభజనలకు పాల్పడుట, క్రీస్తు మనస్సును కలిగియుండుట కానే కాదు. కొరింథీయులు వారిని పట్టి పీడించుచుండిన సమస్యలను అధిగమించాలంటే, మొట్టమొదటిగా వారు తమ వ్యక్తిగత అతిశయాలను పట్టించుకొనకుండా పక్కనబెట్టేసి, నేతృత్వం కొరకు ప్రభువు వైపు తమ కన్నులెత్తడానికి ఇష్టపడు చుండవలెను. ఈ పత్రికలోని అధిక శాతం భాగం, సంఘంలోనికి అక్రమంగా చొరబడుచుండిన ప్రశ్నార్థకమైన నమ్మకములు మరియు సంబంధిత అభ్యాసముల విషయంలో "క్రీస్తు మనస్సును" అన్వయించడానికి అంకితం చేయబడింది.

# అన్వయము

## సందేశం మరియు సందేశహరుడు

దేవుడు వారికి వరముగా అనుగ్రహించిన తలాంతుల ద్వారా, వారు తమ్ముమనుతాము బహు చక్కగా అభివ్యక్తం చేయగలరని కొందరు క్రైస్తవులు తెలుసుకొంటారు; వీరు ప్రభావశీలమైన వక్తలు. సువార్త, చాలా వరకు, నోటి మాటల ద్వారా తెలియజెప్పబడు సందేశమై యున్నందువలనను, క్రీస్తునందలి పరిపక్వతకు చేరుకొనడానికి ఒక ప్రక్క ఉపదేశించడము, మరొక ప్రక్క మందలించడం ప్రాథమికమైన చర్యలై యున్నందువలనను, క్రీస్తు మరియు సిలువను గూర్చిన సత్యమును స్పష్టంగా మాటలాడువారిపై, క్రైస్తవులను ప్రేరేపిస్తూ వారి విశ్వాసమును బలపరచువారిపై సంఘము ఆధారపడుతున్నది. ప్రతి యుగంలోని సంఘము దాని ఉపదేశకులు మరియు బోధకుల చేత ఆశీర్వదింపబడుతున్నది. దీనికి విపర్యయముగా, దేవుడు వారికను గ్రహించిన వాగ్ధాటి తలాంతులను తమ స్వప్రయోజనాల కొరకు ఉపయోగించుటకు ఇష్టపడుచుండువారి చేత సంఘము ఎల్లప్పుడు శపింపబడుతున్నది.

నేర్పుతో మాటలాడగలవారిని క్రైస్తవులు ప్రశంసించవలెను. మాటలాడగల నిపుణతలను అభివృద్ధి చేసుకొంటూ సత్యమును ప్రచురము చేయునిమిత్తము వాటిని వినియోగించుకొనువాడు సన్మానింపబడవలెను. క్రైస్తవులు కూడ సవిమర్శకంగా, వివేచిస్తూ వింటూ వుండాలి. మృదుత్వముతోను, వీనులకు విందుగొలుపు వినోదంతోను అందించబడు ప్రసంగం సత్యమును తప్పనిసరిగా తెలియజేస్తుందన్న హామీ ఏమీ లేదు. క్రీస్తును లెస్సగా సేవించుటకుగాను, దేవుని వాక్యపరిచర్య చేయువారు మొదట దేవుని వాక్యముతో పరిచయముగలవారై, సంబంధిత విషయ పరిజ్ఞానముగలవారై యుండవలెను. వారికి బైబిలు క్షుణ్ణంగా తెలిసి యుండాలి, వారు నడిపింపు కొరకు దాని మీదే ఆధారపడాలి. జ్ఞానము సంపాదించుకొని, మాటలు మాటలాడు విధానమును నేర్చుకొనడం మాత్రమే సరిపోదు. క్రైస్తవ ఉపదేశకుడు హృదయాంతరాళములో నుండి మాటలాడవలెను. చిత్తశుద్ధి మరియు వ్యక్తిగత అంకితమునకు మరొక ప్రత్యామ్నాయం లేదు.

వారు ఉపదేశించే అంశముల విషయంలో ఉత్సాహభరితులైయుండు అధ్యాపకుల చేత విద్యార్థులు ప్రభావితమవుతారు మరియు ప్రేరేపింపబడుతారని విద్యనభ్యసింపజేయు ప్రబోధకులు చెప్పుతుంటారు. క్రైస్తవ ఉపదేశకుడు సువార్త విషయమై ఉత్సాహభరితుడై యుండుట మాత్రమే కాదు, గాని సువార్త బోధ ప్రకారం జీవించడానికి తానే అంకితమై యుండాల్సివున్నది. అతడు పరిశుద్ధుడై యుండాలి. ఒకే వ్యక్తిలో గుణశీలము మరియు జ్ఞానము ఒక్కచోట కేంద్రీకృతమైనప్పుడు, దీనికి తోడుగా వాగ్ధాటితో కూడిన నిపుణతలు జోడింపబడినప్పుడు, పరలోక రాజ్యం దీవింపబడుతుంది. గొప్ప గొప్ప బైబిలు బోధకులు వాగ్ధాటిపై మాత్రమే ఆధారపడలేదు. వారు శ్రోతలను వారు మాటలాడిన మాటల చేత మాత్రమే కాదు, గాని వారి సొంత జీవిత

విధానర చేత కూడ ప్రేరేపించారు. సత్యము గూర్చి మాటలాడువారున్నారు, శ్రోతలను విస్మయపరుస్తూ తమ వాగ్రూపమైన నిపుణతలతో వారికి వినోదం కలిగించువారున్నారు - ఈ ఇరువురిలో ఎవరిని ఎంపిక చేసుకోవాలి అనే ప్రశ్న తలెత్తినప్పుడు, సత్యమును ఎంపిక చేసుకొనడం ద్వారా సంఘం దీవింపబడుతుంది.

పౌలును విమర్శించుచుండినవారు అతని కుతర్కము యొక్క స్థాయి విషయంలో నిస్సందేహంగా పొరపాటును కనుగొన్నారు. వాగ్ధాటికి సంబంధించిన నిపుణతలు మరియు తత్త్వశాస్త్ర సంబంధమైన సూక్ష్మ భేదాల విషయంలో ఇతరులు ఇతనిని అధిగమించారు (2 కొరింథీ. 10:10; 11:6). ప్రపంచం కోసం అతని హృదయం మండుచుండింది గనుక పౌలు ప్రపంచంపై తన ప్రభావాన్ని ప్రదర్శించాడు. అతడు క్రీస్తు మరియు సిలువలో లీనమైపోయాడు. ఇతరులు ఏమైయుండవలెనని అతడు వారిని కోరాడో, తాను అదే అయియుండుటకు ఎటువంటి దాపరికమైనను లేకుండా తనను తాను అంకితం చేసుకొన్నాడు. ఈనాటి సంఘం యొక్క ఉపదేశకులు మరియు బోధకులు సత్యమును ఎరిగి, దానిని వారి సొంత జీవితాల్లో ఆలింగనము చేసుకొంటూ, వారి సమకాలికులకు సత్యమును బోధించినప్పుడు ఆ సంఘం దీవింపబడుతుంది.

## ఆత్మసంబంధమైన మనుష్యుడై యుండుట (2:15)

క్రైస్తవుల భాషలో "ఆత్మసంబంధమైన" అనే మాట కంటె, కొన్ని మాటలు అతి తరుచుగా వినబడుతుంటాయి. ఆత్మసంబంధమైనవారై యుండిన క్రైస్తవులను పౌలు 1 కొరింథీ. 2:15లోను, గలతీ. 6:1లోను ప్రశంసించాడు. క్రైస్తవులు ఆత్మసంబంధమైనవారై యుండాలని ఆశించుట వారికి అదొక యోగ్యమైన లక్ష్యమవుతుంది, కాని ఈ పదము సులభంగా దూషింపబడుతున్నది. ఆత్మసంబంధమైనవారై యుండాలని మనుష్యులు తలచేదంతా దైవభక్తితో కూడినదై యుండనవసరం లేదు.

"ఆధ్యాత్మికత" అనే నామవాచకము, ప్రయోజనకరమైనదే అయినప్పటికిని, ఈ పదం బైబిలులో లేదు. దైవభక్తితో కూడిన జీవితం, ఆధ్యాత్మికతకు సంబంధించిన అవాస్తవమైన నడకయై యున్నదని బైబిలు సంబంధమైన గ్రంథకర్తలు చెప్పరు. మనుష్యులను వర్ణించడానికి "ఆత్మసంబంధమైన" అనే విశేషణం సహితం అరుదుగా ప్రయోగింపబడింది. ఒక వరము (రోమా. 1:11) లేదా ధర్మశాస్త్రము (రోమా. 7:14) ఆత్మసంబంధమైనదై యుండగలదు. సత్యము ఆత్మసంబంధమైనదై యున్నట్టే, ఆరాధన మరియు ఆశీర్వాదములు కూడ ఆత్మసంబంధమైనవై యున్నవి (రోమా. 12:1; 15:27). సాముదాయికంగా "క్రైస్తవులు" అనే పదమును బైబిలు అప్పుడప్పుడు ప్రయోగించుచున్నప్పటికిని, అది ఎన్నడైనను ఎవరైనా ఒక వ్యక్తిని పట్టుకొని, "ఇతడు ఆత్మసంబంధమైనవాడు" అని చెప్పదు.

కేవలము ఒకడు మాటలాడుచుండిన తీరును తన తీర్మానమునకు ఆధారంగా చేసుకొంటూ, అతడు ఆత్మసంబంధమైనవాడై యున్నాడని పౌలు ఎన్నడును ఒకనికి తీర్పు తీర్చలేదు. ఆత్మసంబంధమైనవారమై యుండుట అనగా, అది ఒకరు "యేసు"

అనే పదమును తన సంభాషణలో ఎన్ని పర్యాయాలు ఉపయోగిస్తున్నాడు లేదా, “దేవునికి స్తోత్రం!” అని ఎంత తరుచుగా పలుకుతున్నాడనే విషయం కానే కాదు. ఆత్మసంబంధమైన స్త్రీగాని లేదా పురుషుడు గాని విశ్వాసుల సమాజంలో నిరీక్షణను మరియు సంతోషమును కనుగొనును. సామూహిక లక్షణము ఆత్మసంబంధమైన మనుష్యునిలోనికి చొచ్చుకొనిపోతుంది. ఆత్మసంబంధమైనవాడు నైతిక న్యాయవర్తనముగలవాడై యుండును. ప్రార్థనలో గడుపబడే సమయంలో లేదా ఒక స్నేహితునికి ఏదైనా ఒక చిన్న సహాయం చేయడంలో సంతోషాన్ని కనుగొనడానికి అతడు నేర్చుకొంటాడు. క్రీస్తునందలి విశ్వాసం ఆత్మసంబంధమైన వాని జీవితానికి ఒక అనుబంధ అంగము కాదు; అది ఈ జీవితమునకు గుండెవంటిదై యున్నది. ఊపిరి పీల్చుకొనడం ఎలా యథాప్రకారం కొనసాగుతుంటుందో, ప్రార్థనలు చేయడం కూడ అలాగే కొనసాగుతుంటుంది. ఒక క్రీడాభిమాని తనకిష్టమైన జట్టు గూర్చి ఎలా మాటలాడుకొనుచుండునో, ఆత్మసంబంధ మైనవాడు క్రీస్తు గూర్చి అంత స్వాభావికంగా మాటలాడు చుండును. ఆత్మసంబంధమైన వారమై యుండుట అనగా, క్రీస్తును స్వాయత్తం చేసుకొనుట, ఆయన వాక్యమును నేర్చుకొనుట, ఆయన ప్రజలను ప్రేమించుట, మరియు ఆయన ప్రజలతో కలిసి ఆయనను ఆరాధించుటయని అర్థం.

## అంతరంగములో నుండి కలుగు జ్ఞానము (2:15)

ఆత్మసంబంధమైన కొన్ని సత్యములు క్రైస్తవ విశ్వాసము లోపలి నుండి మాత్రమే గ్రహింపనగునని, ప్రకృతి సంబంధమైన మనుష్యునికి మరియు ఆత్మసంబంధమైన మనుష్యునికి మధ్య పౌలు చూపించిన అంతరములు సూచించుచున్నవి. వెలుపట ఉన్నవాడు, తనను తాను దేవునికి అంకితము చేసుకొననివాడు లేదా దేవుని యెడల వైరభావంగలవాడు, క్రీస్తునందలి రక్షణను కనుగొనువారికి తెలిసిన విషయాలేమిటో గ్రహింపడు, బహుశా గ్రహింపజాలడు.

కొన్ని క్రైస్తవ సత్యములు వాటిలో పాల్గనుట ద్వారా మాత్రమే అవగాహన చేసుకొనబడగలవనేది నిజమేనా? ఉదా|| ఒకడు, మత్స్య శ్వాసేంద్రియాలు నీటి నుండి ప్రాణవాయువును తీసుకొను తీరు గూర్చి అధ్యయనం చేస్తూ పరిశోధనను నిర్వహించడంలో తన జీవితకాలమంతటిని గడిపి, ఈ ప్రక్రియ మరియు మత్స్య శ్వాసేంద్రియాలకు మూలమైన కణజాలము విషయంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రవీణుడయ్యాడని అనుకొందాము. ఒకవేళ ఇతడే ఏదో ఒక విధంగా ఒక చేప యగుటకును, ఆ తరువాత మరలా మామూలు మనిషి అగుటకును అనుమతింపబడినట్లయితే ఏమవుతుంది? ఇటువంటి విజ్ఞానశాస్త్రవేత్త చేత దశాబ్దాల తరబడి చేయబడు సిద్ధాంతపరమైన అధ్యయనం ఎన్నడైనను సమకూర్చజాలని విషయాలను, అతడే స్వయంగా చేపయై, అట్టి అనుభవాల గూర్చిన విషయాలను నేర్చుకోగలిగాడని ఒకడనుకొనవచ్చు.

అదే విధంగా, బైబిలులోని నీతి నియమముల గూర్చిన లేదా దాని చారిత్రాత్మకమైన వివరాల గూర్చిన విద్యావిషయకమైన చర్చలు - అవి లోతైనవి, గంభీరమైనవి, మరియు

ప్రయోజనకరమైనవై యున్నట్టు ◌ా క్రీస్తునందు విశ్వాసముంచుటకు ప్రత్యామ్నాయమై యుండజాలవు. అంతరంగములోని సమాధానం, అధిగమించలేనంతటి కష్టాలు ఎదురగు చుండు సందర్భంలో నుండు నిరీక్షణ, విశ్వాసుల సహవాసం, మరియు మేలును ఎన్నుకొనుట వలన కలుగు సంతృప్తి, ఇవన్నీ కూడ వ్యక్తిగతమై విషయాలై ఉన్నాయి గనుక వీటిని మాటల్లో వర్ణించడం కష్టమవుతుంది. వారి విశ్వాసం అత్యంత ఆకర్షణీయమైనదను విషయాన్ని క్రైస్తవేతరులకు వివరించడానికి క్రైస్తవులు కష్టపడుతుంటారు ఎందుకనగా కొన్ని సత్యాలు విశ్వాస పరిధి లోపల, అనుభవం ద్వారా మాత్రమే అర్థమవుతాయి.

---

సూచనలు

[1]Hans-Ruedi Weber, *The Cross: Tradition and Interpretation*, trans. Elke Jessett (London: SPCK, 1979; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 73. [2]Richard E. Oster, Jr., *1 Corinthians,* The College Press NIV Commentary (Joplin, Mo.: College Press Publishing Co., 1995), 81. [3]Sirach 15:14–17; NAB. (This text, also known as "The Wisdom of Ben Sirach" or "Ecclesiasticus," is part of the Apocrypha.) [4]Leon Morris, *The First Epistle of Paul to the Corinthians,* rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 56. [5]Paul S. Minear, "Christ and the Congregation: 1 Corinthians 5—6," *Review and Expositor* 80 (Summer 1983): 349. [6]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3rd ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 953. [7]ESVలో "ఆత్మ సంబంధులైనవారికి, ఆత్మ సంబంధమైన విషయాల గూర్చిన అర్థం చెప్పుచు . ." అని అర్థమిచ్చు అనువాదం కలదు. [8]Robert H. Stein, *A Basic Guide to Interpreting the Bible: Playing by the Rules* (Grand Rapids, Mich.: Baker Books, 1994), 66–67.